**Sakshi**

# వచ్చే నెల 30లోగా ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

- తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు
- ఏపీ ఆన్‌లైన్‌తో అవగాహన ఒప్పందం
- 40 ఏళ్ల వయోపరిమితి వర్తింపు
- ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 4,009 పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 30లోగా నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. ఈ పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం విశాఖలో ఆయన మీడియా మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లలో ఇంకా భర్తీకి నోచుకోని పోస్టులను కూడా ఈసారి కలిపి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 400 ఏఈ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని, 748 ఏఈఈ పోస్టులకు కూడా త్వరలో నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. కాగా, గతంలో జరిగిన జాప్యం వల్ల వయోపరిమితిని ఆరేళ్లకు సడలిస్తూ జారీ చేసిన జీవో సెప్టెంబర్ 30తో ముగుస్తుందన్నారు. అందువల్ల ఈలోగా ఇచ్చే



నోటిఫికేషన్లకే 40 ఏళ్ల వయోపరిమితి వర్తిస్తుందని చెప్పారు. ఒకవేళ ఏదైనా కారణంతో నోటిఫికేషన్ల జారీలో జాప్యం జరిగితే వయోపరిమితి సడలించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆన్‌లైన్ పరీక్షల వల్ల అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ కోసం ఏపీ ఆన్‌లైన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. గ్రూప్-1, 2, 3 పోస్టులకు 50 వేల మందికి పైగా అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉన్నందున.. తొలుత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో అర్హత సాధించిన వారినే ఆన్‌లైన్ పరీక్షకు అనుమతిస్తామన్నారు. సన్నద్ధత లేకుండా పరీక్షకు హాజరయ్యే వారిని వడబోసేందుకే 1:50 నిష్పత్తిలో స్క్రీనింగ్ టెస్ట్ పెడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే డ్రాఫ్ట్ సిలబస్‌ను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టామని చెప్పారు. అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత నిపుణుల కమిటీతో సిలబస్ రూపొందిస్తామన్నారు. అలాగే పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో 'కీ' పెడతామని, దానిపై అభ్యంతరాలు స్వీకరించి నిపుణుల కమిటీకి పంపిస్తామని చెప్పారు. కమిటీ సిఫారసు మేరకు ఫైనల్ కీని వెబ్‌సైట్‌లో పెడతామన్నారు. ఈ విధానం వల్ల కోర్టు కేసుల సమస్య కూడా ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీపీఎస్సీపై 500కు పైగా కోర్టు కేసులు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, పూర్తి స్థాయి బోర్డును ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం బోర్డులో కొద్దిమంది సభ్యులే ఉన్నప్పటికీ పరిపాలనలో ఇబ్బందుల్లేకుండా చూస్తున్నట్లు తెలిపారు.